

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

JUNE-2014

సంవత్సర చందా రూ. 50/-

క్రీస్తు సంఘములు సమర్పించు

సత్యవాణి టి.వి. కార్యక్రమములను

**ప్రతి ఆదివారము సాయంత్రం 6.00 గం॥లకు శుభవార్త**

**ప్రతి బుధవారం సాయంత్రం 6.30 ని॥లకు రక్షణ**

**ప్రతి గురువారం మధ్యాహ్నం 2.30 ని॥లకు రక్షణ**

**ప్రతి శనివారం ఉదయం 7.00 గం॥లకు**

**ప్రేమసాక్షి (తిరుపతి) ఛానల్‌లలో వీక్షించండి**

ఉచిత బైబిల్ కరస్పాండెన్సు కోర్సులో చేరండి. ఆకోర్సు పూర్తిచేసి ఒక బైబిలును ఉచితముగా బహుమతి పొందండి. ఈ రోజే మాకు వ్రాయండి. మీ ఇరుగుపొరుగు వారు కూడా ఈ కోర్సు చేయవచ్చును


మా అడ్రస్

**సత్యవాణి**

**పో.బాక్స్ నెం.80,**

**కాకినాడ.ఎ.పి, 533 001**

**ఫోన్ : 0884 - 2363722**

# సత్యవాక్కు
## THE WORD OF TRUTH

P.o. Box -80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి - 32 | జూన్- 2014 | సంచిక - 11


## రక్షించునట్టి విశ్వాసము
### (The Faith that Saves)

మానవులు రక్షించబడవలెనంటే విశ్వాసము అత్యవసరము. విశ్వాసము లేకుండ దేవునికి ఇష్టుడై యుండుట అసాధ్యము. "నేను ఆయనను (అనగా దేవుని కుమారుని) అని మీరు విశ్వసించని యెడల మీరు మీ పాపముల లోనే యుండి చనిపోవుదురు" అని యేసు చెప్పెను (యోహాను 8:24). గనుక మనము విశ్వాసము కలిగియుండుట చాల అవసరము.

అయితే విశ్వాసము ఒక్కటి మాత్రమే సరిపోవునా? మనము రక్షించబడవలెనంటే ఎట్టి విశ్వాసమును మనము కలిగియుండవలెను? రక్షించునట్టి విశ్వాసము ఎట్టిది? దేవుని వాక్యము దీని విషయమై ఏమి చెప్పుచున్నది? దానిని కొంత ఇప్పుడు చూచుకొందము. యాకోబు 2:14-26 వరకు ఇప్పుడు చదువుకొందము.

"నా సహోదరులారా, క్రియలు లేనప్పుడు ఎవడైనను శరీరమునకు కావలసిన వాటిని ఇయ్యక - సమాధానముగా వెళ్ళుడి, చలి కాచుకొనుడి తృప్తిపొందుడని చెప్పిన యెడల ఏమి

ప్రయోజనము? అలాగే విశ్వాసము క్రియలు లేనిదైతే అది ఒంటిగా ఉండి మృతమైనదగును.... దేవుడొక్కడే అని నీవు నమ్ముచున్నావు. ఆలాగునమ్ముట మంచిదే; దయ్యములును నమ్మి వణకుచున్నవి: వ్యర్థుడా, క్రియలు లేని విశ్వాసము నిష్ఫలమైనదని తెలిసికొనకోరుచున్నావా? మన పితరుడైన అబ్రాహాము తన కుమారుడైన ఇస్సాకును బలిపీఠము మీద అర్పించినప్పుడు అతడు క్రియల వలన నీతిమంతుడని తీర్పుపొందలేదా? విశ్వాసము అతని క్రియలతో కూడి కార్యసిద్ధి కలుగజేసెననియు, క్రియల మూలముగా అతని విశ్వాసము పరిపూర్ణ మైనదనియు గ్రహించుచున్నావు గదా? ...కాబట్టి మనుష్యుడు విశ్వాసమూలమున మాత్రమునకాక (Not by faith only) క్రియల మూలముననను నీతిమంతుడని యెంచబడునని, మీరు దీని వలన గ్రహించితిరి.. ప్రాణము లేని శరీరము ఏలాగు మృతమో అలాగే క్రియలులేని విశ్వాసము మృతము.

యాకోబు వ్రాసిన సంగతిని గమనించుడి. మీకు విశ్వాసము ఉన్నంత మాత్రమున అది సరిపోదు. మీ విశ్వాసము నకు క్రియలు జోడించుడి. అప్పుడు మాత్రమే మీరు నీతిమంతులని యెంచ బడుదురు. మీ విశ్వాసమునకు మీరు విధేయులు కానియెడల అట్టి విశ్వాసము మిమ్మును రక్షించదు. విశ్వాసము క్రియలు లేనిదైతే అది ఒంటిగా ఉండి మృతమైనదగును. అబ్రాహాము యొక్క విశ్వాసము ఎట్లు పరిపూర్ణమాయెను? అతడు దేవునియందు విశ్వసించుటయే కాకుండ దేవుని మాటలకు సంపూర్ణ విధేయత చూపించుట వలననే కదా? ఈనాడు మనము పరిపూర్ణులము ఎట్లు కాగలుగుదుము? దేవుని వాక్యమును విశ్వసించుటయే కాదు గాని, ఆ వాక్యమునకు విధేయత చూపుట ద్వారానే కదా. యేసు ప్రభువునందు నేను విశ్వసించుచున్నాను గాని నేను ఆయన నామమున బాప్తిస్మము పొందుటకు నాకు ఇష్టము లేదు అని నీవు చెప్పవచ్చును. అట్టి విశ్వాసము నిన్ను రక్షించగలదా? ప్రాణము లేని శరీరము ఏలాగు చచ్చినది అగునో అలాగే క్రియల ద్వారా విధేయత చూపని విశ్వాసము కూడాను చచ్చినదగును.

హెబ్రీయులకు వ్రాసిన పత్రిక 11వ అధ్యాయమును మనము చూచిన యెడల అనేకమంది విశ్వాస వీరులను గూర్చి పరిశుద్ధాత్ముడు అందు మనకు సాక్ష్యమిచ్చుచున్నారు. విశ్వాసమును బట్టి హేబెలు కయీనుకంటె శ్రేష్ఠమైన బలిని దేవునికి అర్పించెను. విశ్వాసము బట్టి హనోకు మరణము చూడకుండు నట్లు కొనిపోబడెను. విశ్వాసమును బట్టి

నోవహు తన ఇంటివారి రక్షణ కొరకు ఒక ఓడను సిద్ధము చేసెను. విశ్వాసమును బట్టి అబ్రాహాము పిలువబడినప్పుడు ఎక్కడికి వెళ్ళవలెనో అది ఎరుగక బయలు వెళ్ళెను. విశ్వాసమును బట్టి ఇస్సాకు, యాకోబు, యోసేపులు దేవుని చిత్తమును జరిగించిరి. విశ్వాసమును బట్టి మోషే ఐగుప్తు ధనముకంటె క్రీస్తు విషయమైన నింద గొప్ప భాగ్యమని యెంచుకొని, అల్పకాలము పాపభోగము అనుభవించుట కంటె దేవుని ప్రజలతో శ్రమ అనుభవించుట మేలని యోచించి పనిచేసెను. ఇకను ఏమి చెప్పుదుము? గిద్యోను, బారాకు, సమ్సోను, యెఫ్తా దావీదు, సమూయేలును గూర్చియు, ప్రవక్తలను గూర్చియు వివరించుటకు సమయము చాలదు. వారు విశ్వాసము ద్వారా రాజ్యములను జయించిరి. నీతికార్యములను జరిగించిరి, వాగ్దానములను పొందిరి; సింహముల నోళ్ళను మూసిరి; అగ్నిబలమును చల్లార్చిరి; ఖడ్గధారను తప్పించుకొనిరి, బలహీనులుగా ఉండి బలపర్చబడిరి. వారు విశ్వాసము ద్వారా చేసిన అనేక ఘన కార్యములను గూర్చి మనము చెప్పుకొనవచ్చును. అయితే వీరందరు ఘనులెట్లయిరి? వారందరు తమ విశ్వాసమును క్రియల ద్వారా నిరూపించుట వలననేగదా? వారిలో ప్రతి ఒక్కడు కూడ దేవుడు వాని కేమి ఆజ్ఞాపించెనో ఆ ఆజ్ఞను అక్షరాల నెరవేర్చిరి. వారందరు దేవుని యెడల తమకున్న విశ్వాసమును బట్టి విధేయత చూపించిరి. అందువలన వారు నీతిమంతులని తీర్చబడిరి. వారి విధేయత ద్వారా వారి విశ్వాసము పరిపూర్ణమాయెను. అవిధేయత చూపుచు దేవునికి నమ్మకముగానున్న ఏ ఒక్కని గూర్చియైనను బైబిలు బోధించుటలేదు. సరిగదా విశ్వాసులలో అవిధేయతను దేవుడు ఖండించుటయేగాక శిక్షించినట్లు బైబిలునందు అనేక సందర్భములలో మనము చూడగలము. “ఒకడు దహన బలులను అర్పించుట వలన ఆయన సంతోషించునా? ఆలోచించుము బలులు అర్పించుటకంటె ఆజ్ఞను గైకొనుటయు, పొట్టేళ్ళక్రొవ్వు అర్పించటకంటె మాట వినుటయు శ్రేష్ఠము” అని దైవవేదము బోధించుచున్నది (1సమూ 15:22).

విశ్వాసము మనలను ఎట్లు రక్షించును? మనము దేవుని ఆజ్ఞలకు విధేయత చూపుటకు ప్రోత్సహించుట ద్వారా అది మనలను రక్షించును. దేవుని వాక్యమును వినుట ద్వారా, చదువుట ద్వారా మనకు ఆ విశ్వాసము కలుగును (రోమా 10:17; యోహాను 20:30-31). ఒకడు రక్షింపబడవలెనంటే అతడు చేయవలసిన కొన్ని పనులున్నవి. పాపులైనవారు యేసునందు విశ్వాస

ముంచవలెనని దేవుని వాక్యము ఆజ్ఞాపించుచున్నది. "నేను ఆయనను అని మీరు విశ్వసింపని యెడల మీరు మీ పాపములోనే మరణింతురు" అని యేసు చెప్పుచున్నారు.

అనేకులు యేసు దేవుడు, దేవుని కుమారుడు అని విశ్వాసము అంతటితో ఆగిపోవుదురు. నేను యేసు ప్రభువును నా ఆత్మ రక్షకునిగా అంగీకరించుచున్నాను అని అనేకులు మాకు ఉత్తరాలు వ్రాస్తుంటారు. యేసునందు విశ్వాసముంచగానే, లేదా ఆయనను అంగీకరించగానే మేము రక్షించబడితిమి అని వారి అభిప్రాయము. అయితే అట్టి విశ్వాసము ఒక్కటి మాత్రమే రక్షించగలదా? నీవు యేసు ప్రభువునందు నమ్ముకొనుము, వెంటనే నీవు రక్షించ బడుదువు అని అనేకులు బోధించు చున్నారు. నీవు నమ్మినంత మాత్రముననే రక్షించబడుదువని వాక్యము చెప్పు చున్నదా? విశ్వసించిన మాత్రముననే నీవు రక్షించబడగలవా? యాకోబు 2:24 ఏమి చెప్పుచున్నది. ఇందులో ఏది సత్యము? మానవుల సిద్ధాంతములా లేక దేవుని వాక్యమా? మన ఆత్మరక్షణకు దేవుని వాక్యమునే అంగీకరించుట మనకు క్షేమకరము కదా?

అవును, నీవు యేసునందు విశ్వాసముంచావు, బాగున్నది. విశ్వసించిన నీవు మారుమనస్సు పొందవలెనని యేసు ఆజ్ఞాపించుచున్నారు: "మీరు మారుమనస్సు పొందని యెడల మీరందరును అలాగే నశింతురు" అని లూకా 13:3లో ఆయన చెప్పుచున్నారు. అటు తరువాత యేసు దేవుని కుమారుడు అని నీవు విశ్వసించుచున్నట్లు, నీ విశ్వాసమును మనుష్యుల యెదుట ఒప్పుకొనవలెనని యేసు చెప్పుచున్నారు: "మనుష్యుల యెదుట ఎవడు నన్ను ఒప్పుకొనునో నేనును వానిని ఒప్పు కొందును" అని మత్తయి 10:32లో ఆయన చెప్పుచున్నారు. అనేకులు నీ పాపములను మనుష్యుల యెదుట ఒప్పుకొనవలెనని బోధింతురు. పాపములను మనము దేవుని యెదుట ఒప్పుకొనవలెను. మనుష్యుల యెదుట యితే మన విశ్వాసమును ఒప్పుకొన వలెనని బైబిలు బోధించుచున్నది.

నీవు యేసునందు విశ్వసించావు పాపముల విషయమై మనస్సు మార్చు కొన్నావు. యేసు దేవుని కుమారుడని ఒప్పుకొంటావు బావుంది. అయితే క్రీస్తు ఇచ్చు రక్షణలోనికి ప్రవేశించుటకు ఒకే ఒక్కటి నీవు చేయవలెను: బాప్తిస్మము పొందవలెను. అబ్బే నేను నీవు చెప్పిన వన్నీ చేయుదును గాని బాప్తిస్మము అవసరం లేదనుకుంటాను అని నీవు అనుకొనవచ్చును. మార్కు 16:16 లో యేసు ఏమి చెప్పుచున్నారో ఒక్కసారి

వినండి: "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షించబడును". నీ విశ్వాసమునకు బాప్తిస్మము పొందుట ద్వారా విధేయత చూపించుము. అపొ.కా. 2:38లో "మీరు మారు మనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము ద్వారా ప్రభువు నీ పాపములను కడిగివేయును. బాప్తిస్మము పొందిన తరువాతనే నీవు రక్షించబడుదువు గాని దానికి ముందు కాదు "దానికి సాదృశ్యమైన బాప్తిస్మము ఇప్పుడు మిమ్మును రక్షించుచున్నది" అని 1 పేతురు 3:21 చెప్పుచున్నది.

మీలో ఎవరయినను నేను విశ్వసించగానే రక్షింపబడితిని అని అనుకొనుచున్న యెడల యేసుప్రభువు గాని, పరిశుద్ధాత్ముడు గాని, అపొస్తలులు గాని అట్లు బోధించలేదని గ్రహించుడి. విధేయత చూపించు విశ్వాసమే రక్షించు నట్టి విశ్వాసము విశ్వాస మొక్కటి మాత్రమే ఎన్నడు ఎవరినీ, ఎక్కడా రక్షించలేదు. అట్లయిన దయ్యములు కూడా రక్షించబడును గదా?

## బుద్ధిహీనుడైన ధనికుడు
## (The Rich Fool )

లూకా 12:13-21

**పరిచయము :**

బుద్ధిహీనుడైన ధనికుని గూర్చిన ఉపమానము లూకా సువార్తలో మాత్రమే కనబడును. అయితే ఈ ఉపమానములో యున్న అంశము క్రొత్తదేమీ కాదు. అది లూకా సువార్తలో మాత్రమే గాక లేఖనాల్లో పలుచోట్ల కనబడును. మన ప్రభువైన యేసు లోభత్వమును గూర్చి ఇక్కడ బోధించెను.

"మరియు ఆయన వారితో -మీరు ఏవిధమైన లోభమునకు ఎడమియ్యక జాగ్రత్తపడుడి, ఒకని కలిమి విస్తరించుట వాని జీవమునకు మూలము కాదనెను" (లూకా 12:15).

దేనినైనా దేవుడొక్కమారు పలికితే అది చాలు. అది మార్పులేనిదవుతాది. అయినను కొన్ని అంశములు బైబిలులో పదే పదే జ్ఞాపకము చేయవలసివచ్చెను. ధనము బైబిలు అంశమే. ఈలోక సంపద విషయమై మనము శోధనలో పడుట సులువే. ధనవంతులగుటకు ఆశించని వారు అరుదు. కొందరు తమ ఆస్తియే ప్రాపకమని నమ్మి తమ ధన విస్తారతను బట్టి పొగడు కొందరు (కీర్తన 49:6). దేవుని ప్రజలుకూడ ధనాశనుండి వేరుచేయబడినవారు కాదు, లోభత్వమనే పాపమును చూచిచూడనట్లుగా

యుండుట సులభమే.

మంచి సమరయుని గూర్చిన ఉపమానము అన్నింటిలో కంటే ఆచరణీయము. బుద్ధిహీనుడైన ధనికుని గూర్చిన పాఠము అత్యవసరము. క్రైస్తవులమని చెప్పుకునే వారిలో కూడ ధనాశ ఎంత ప్రబలియున్నదంటే దానిని గుర్తించుట దుర్లభమే.

ధనాశను గూర్చి హెచ్చరించుమని అపొస్తలుడైన పౌలు తిమోతికి ఉద్బోధించాడు. అతడిట్లు చెప్పాడు: "ధనవంతులగుటకు అపేక్షించు వారు శోధనలోను, ఉరిలోను అవివేక యుక్తములును హానికరములునైన అనేక దురాశలలో పడుదురు. అట్టివి మనుష్యులను నష్టములోను నాశనము లోను ముంచివేయును. ఎందుకనగా ధనాపేక్ష సమస్తమైన కీడులకు మూలము, కొందరు దానిని ఆశించి విశ్వాసమునుండి తొలగిపోయి నానా బాధలతో తమ్మును తామే పొడుచుకొనిరి. దైవజనుడా, నీవైతే వీటిని విసర్జించి నీతిని భక్తిని విశ్వాసమును ప్రేమను ఓర్పును సాత్వికమును సంపాదించుకొనుటకు ప్రయాసపడుము" (1 తిమోతి 6:9-11).

"ఇహమందు ధనవంతులైనవారు గర్విష్ఠులు కాక, అస్థిరమైన ధనమునందు నమ్మకముంచక సుఖముగా అనుభవించుటకు సమస్తమును మనకు ధారాళముగ దయచేయు దేవునియందే నమ్మిక యుంచుడని ఆజ్ఞాపించుము. వారు వాస్తవమైన జీవమును సంపాదించుకొను నిమిత్తము రాబోవు కాలమునకు మంచి పునాది తమ కొరకు వేసికొనుచు మేలుచేయువారును సత్క్రియలు అనుధనము కలవారును ఔదార్యము గలవారును తమ ధనములో ఇతరులకు పాలిచ్చు వారునై యుండవలెనని వారికి ఆజ్ఞాపించుము"(1తిమోతి 6:17-19).

ఒక మనుష్యుడు తన కుటుంబ పరమైన సమస్యను పరిష్కరింపుమని యేసును కోరగా, ఆయన ఈ ఉపమానము చెప్పెను. "ఆజనసమూహములో ఒకడు- బోధకుడుగా పిత్రార్జితములో నాకు పాలు పంచి పెట్టవలెనని నా సహోదరునితో చెప్పుమని ఆయన నడిగెను" (లూకా 12:13). అందు కాయన ఓయీ, మీమీద తీర్పరిగానైనను పంచిపెట్టు వానిగానైనను నన్నెవడు నియమించెనని అతనితో చెప్పెను" (లూకా 12:14). అదొక గద్దింపుతో కూడిన జవాబు. యేసు ఈ లోకసంబంధవ్యవహారములు పరిష్కరించుటకు రాలేదు. అది ఆయన పనికాదు. నశించిన దానిని వెదకి రక్షించుటకు ఆయన వచ్చెను (లూకా 19:10). ఇట్టి సంబంధమైన వ్యవహారముల విషయమై యూదుల

చట్టము విశదముగానే యున్నది. (ద్వితీ 21:15-17). ఇది చిరకాలమునుండి యున్న ధర్మశాస్త్రము. దానిలో తర్కించుట కవకాశమేమియు లేదు. బహుశ యేసును అభ్యర్థించిన వాడు చిన్న (సహోదరుడు) వాడై యుండవచ్చును.

అయితే అన్నదమ్ముల మధ్య తలెత్తిన వివాదమును యేసు ప్రభువు గొప్ప పాఠమునుపదేశించుటకు ఒక తరుణముగా మార్చెను. ఆ మనుష్యుడు లేవనెత్తిన సమస్య లౌక్యమైనది. ఆ వివాదమునకు కారణమేమో ఆత్మీయ మైనది. అందువలన యేసు ధనాశను గూర్చిన ఉపమానమును చెప్పెను. యేసుప్రభువు తమ హృదయ ములను కాదుగాని తమ సమస్యలను పరిష్కరిం చాలని కోరుకొనేవారనేకులు. ఈ కుటుంబములో తలెత్తిన ధన సంబంధ మైన సమస్య అంతకంటే గొప్ప సమస్య యైన లోభత్వమునకు సూచికగా యున్నదని యేసు ఎరుగును. యేసు ప్రభువు సమస్యల లక్షణములను గాక వాటి కారణాన్ని పరిష్కరింపబూను కున్నారు.

"మరియు ఆయనవారితో ఈ ఉపమానము చెప్పెను. ఒక ధనవంతుని భూమి సమృద్ధిగాపండెను. అప్పుడతడు నా పంట సమకూర్చుకొనుటకు నాకు స్థలము చాలదు గనుక నేనేమి చేతునని తనలో తాను ఆలోచించుకొని, నేనీలాగు చేతును; నాకొట్లు విప్పి వాటికంటె గొప్ప వాటిని కట్టించి, అందులో నా ధాన్యమం తటిని, నా ఆస్తిని సమకూర్చుకుని నా ప్రాణముతో ప్రాణమా, అనేక సంవత్సర ములకు విస్తారమైన ఆస్తి నీకు సమకూర్చ బడియున్నది. సుఖించుము తినుము త్రాగుము సంతోషించుమని చెప్పుకొందు ననుకొనెను. అయితే దేవుడు –వెర్రివాడా, యీ రాత్రి నీప్రాణము నడుగుచున్నారు; నీవు సిద్ధపరచినవి ఎవనివగునని అతనితో చెప్పెను. దేవుని యెడల ధనవంతుడు కాక తన కొరకే సమకూర్చు కొనువాడు ఆలాగుననే యుండునని చెప్పెను" (లూకా 12:16-21).

యేసు ఒక వ్యవసాయకుని విని యోగించి అతనినుండి ఆత్మీయ పాఠము లు ఉపదేశించెను. యేసుకాలములో యూదులు వ్యవసాయముపై ఆధారపడిన వారే. ప్రజలయొక్క దైనందిన జీవితసం ఘటనలనే యేసు తనఉపమానములలో వినియోగించెను. ఈ సందర్భములో వ్యవసాయకుని కుండకూడని లక్షణము లను ఆయన ఎత్తి చూపించెను. వ్యవసాయము పాపము కాదు ఇతడు ఫలవంతమైన వ్యవసాయకుడు. అది గౌరవప్రదమైన వృత్తి. అతడు తన వ్యవసాయ రీత్యా ధనవంతుడయ్యాడు. యిదివరలో కంటే తనకు పంట

అధికముగా వచ్చెను. అతని కొట్లలో సరిపడినంత స్థలము లేకపోయెను. అందువలన కొత్త వాటిని కట్టించుదునను కొనెను. అలాగ సమకూడిన ఆస్థివలన అతడు అనేక సంవత్సరములు కులాసాగా జీవించుదుననుకొనెను. అతడు అనేక సంవత్సరముల మట్టుకు సిద్ధపరచు కొనినను, ఆత్మీయ సుఖము కొరకు ఏమంత సిద్ధపడలేదు. అతనికి కలిగిన విస్తారమైన పంట విషయంలో దేవుని పాత్రను అతడు పూర్తిగా విస్మరించాడు. "దేవుడు చెడ్డ వారిమీదను మంచివారిమీదను తన సూర్యుని ఉదయింపజేసి నీతిమంతుల మీదను అనీతిమంతులమీదను వర్షము కురిపించుచున్నాడు" (మత్త 5:45). ఈ భూమియు దాని సంపూర్ణతయు యెహోవావే యని అతడు మరిచాడు (కీర్తన 50:10-12; హగ్గయి 2:8). మనమేమి యిస్తామో దానిని పొందుదుము. యేమి దాచుకొందువెూ దానిని పోగొట్టు కొందుమను నది వాస్తవము. మానవుని ఆత్మకూడ దేవునిదే. మన్నుయినది వెనుకటివలె మరల భూమికి చేరును. ఆత్మదాని దయచేసిన దేవుని యొద్దకు మరల పోవును" (ప్రసంగి 12:7).

ధనవంతుడైన ఈవ్యవసాయకుడు సమృద్ధిగా వచ్చిన అతని పంటను అపార్థము చేసికొన్నాడు. అతని అభిలాష హర్షింపదగినదే అయినను, అతని అత్యభిలాషము బట్టి అతడు మునిగిపోవలసి వచ్చెను. అత్యాభిలాష గలవాడు విస్తారమైన సంపదలో విజయవంతమైన జీవితంవున్నదని తలస్తాడు. గాని ఒకని కలిమి విస్తరించుట అతని జీవముకు మూలము కాదని ఈఉపమానములో యేసు బోధించారు. మానవుని విలువ అతని సంపాదనములో లేదు.

ధనవంతుడైన వ్యవసాయకుని సంకల్ప మంతయు సింపుల్‌గానే యున్నది : తినుము, త్రాగుము, సుఖించుము!

అతడు దేవుని మరిచాడు దేవుని గూర్చి అతడు తలంచనే తలంచక గొప్పపొరబాటు చేసాడు. తన పాత కొట్లను పడగొట్టి క్రొత్త వాటిని కట్టించుకొనుటలో తప్పేమీలేదు. మంచి వ్యవసాయకుడు భవిష్యత్తును గూర్చి ఆలోచిస్తాడు. అయితే అతని సంకల్పాలన్నిటిలోను దేవునిగూర్చి ఇసుమంతయు ఆలోచించక పోయినందున అవి అతని ప్రాణాంతకమాయెను. విశ్వాసులు తమ సంకల్పాలన్నిటిలోను దేవునికి చోటీయకపోతే సహజంగా వారు పడిపోతారు.

లేఖనములోగల హెచ్చరికలు విశదముగానే యున్నవి "మనుష్యులొక్కసారే మృతి పొందవలెనని నియమింపబడెను; ఆ తరువాత

తీర్పుజరుగును" (హెబ్రీ 9:27). "రేపటి దినమును గూర్చి అతిశయపడకుము. ఏదినమున ఏది సంభవించునో అది నీకు తెలియదు" (సామె 27:1). తదుపరి మానవుని దినములు సంకుచితములు, అవి వాడిగా పరుగెత్తును (యోబు 14:1; కీర్త 90:10; యాకోబు 4:13-16; (1పేతురు 1:24; 2 కొరింథీ 4:17).

"అయితే దేవుడు, వెర్రివాడా ఈ రాత్రి నీ ప్రాణము నడుగుచున్నారు, నీవు సిద్ధపరచినవి ఎవనివగునని అతనితో చెప్పెను'' (లూకా 12:20). ఈ వ్యవసాయదారుని గూర్చి ఇతరులు అంచనా వేసేదానికి దేవుని అంచనాకు గొప్ప వ్యత్యాసమున్నది. దేవుడు నిత్యత్వాన్ని గూర్చి ఆలోచించును, మానవుడు ప్రస్తుతాన్ని గూర్చి ఆలోచించును (యెషయా 55:8-9; 1 కొరింథీ 1:25). ఈలోకం అతనిని జ్ఞాని అన్నాది, దేవుడేమో వెర్రివాడన్నారు!

అతడు వెర్రివాడు ఏలయనగా తన శరీరాన్ని గూర్చి ఆలోచించాడు గాని ఆత్మను మరచిపోయాడు. ఒకడు ఈలోకసంపదను బట్టి జ్ఞాని కావచ్చును గాని ఆత్మీయ విషయాల్లో వెర్రివాడ వచ్చును. ఒకడు ఈలోకంలో కోటీశ్వరుడు కావచ్చునుగాని పరసంబంధముగా భిక్షాధికారి కావచ్చును. ఈ ధనవంతుడు తన కష్టార్జిత ఫలమునుభవించలేకపోయాడు, అతడు ఆ రాత్రే ప్రాణము విడిచాడు.

అతడు ఎంతవిడిచివెళ్లాడు? తన కున్నదంతా! తాను విడిచి వెళ్లవలసిన వాటికొరకు జీవితమంతా కష్టపడుచు తనతో కూడ వచ్చు విలువలను నిర్లక్ష్యము చేయడం ఎంత బుద్ధిహీనత! ఎంత వెర్రితనం!! నిత్యత్వాన్ని గూర్చి సిద్ధపడలేనందున అతడు గొప్ప పొరబాటు చేసాడు. మనలో చాలమందివలె తన మరణ దినము దగ్గరలో లేదనుకొన్నాడు. దీర్ఘాయువును గూర్చి అతనికి మనకు కూడ నిర్ధారణ యేమీలేదు. అందువలన మనం పరలోకములో ధనము కూర్చుకొనుటకు ప్రయత్నించాలి.

"దేవుని యెడల కాక తన కొరకే సమకూర్చుకొనువాడు ఆలాగుననే యుండును" (లూకా 12:21).

తన స్వార్థము కొరకు సమకూర్చే వాడు నిజానికి భిక్షగాడే, అతడు యితరులను గూర్చి గాక తన్నుగూర్చియే ఆలోచించుకొన్నాడు గనుక దేవుడతనిని వెర్రివాడన్నారు. మత్తయి 6:19-21; లూకా 12:33-34లను లూకా 12:21తో పోల్చి చదువుము.

"భూమిమీద మీకొరకు ధనము కూర్చుకొనవద్దు; ఇక్కడ చిమ్మెటయు తుప్పును తినివేయును, దొంగలు కన్నము వేసి దొంగిలించెదరు. పరలోకమందు మీ

కొరకు ధనము కూర్చుకొనుడి; అచ్చట చిమ్మెటయైనను, తుప్పైనను తినివేయదు, దొంగలు కన్నము వేసి దొంగిలరు. నీధనమెక్కడ ఉండునో అక్కడనే నీ హృదయ ముండును" (మత్తయి 6:19-21).

"మీకు కలిగిన వాటిని అమ్మి ధర్మము చేయుడి, పాతగిలని సంచులను పరలోకమందు అక్షయమైన ధనమును సంపాదించుకొనుడి; అక్కడికి దొంగరాడు, చిమ్మెట కొట్టదు, మీధనమెక్కడ ఉండునో అక్కడనే మీ హృదయముండును" (లూకా 2:33-34).

బుద్ధిహీనుడైన ధనవంతుని గూర్చి ఉపమానము చెప్పిన తరువాత దేవుడు తన సృష్టియెడల కలిగిన ఔదార్యమును గూర్చి బోధించారు (లూకా 12:22-32). ఒకడు అతిగా చింతచుటవలన యేమీ చేయలేడు గాని పరమందున్న దేవుడుఆకాశపక్షులను ఎట్లు పోషించునో అట్లే తన బిడ్డలను కూడ ఆదుకొనునని ఆయన బోధించారు. క్రీస్తు శిష్యులు దేవుని కృపయందు నమ్మిక యుంచాలి. ఆయన రాజ్యమును మొదట వెదకాలి (2థెస్స 3:10-11; సామెత 6:6-8 మత్త 6:33).

ముగింపు :

విచారం యేమంటే లోభత్వము ఒక మర్యాదపూర్వక పాపముగా నేడు పరిగణింపబడుచున్నది. క్రైస్తవులు కూడ చాలమంది దానికి లోనైయున్నారు. లోభత్వము పాపము మాత్రమేగాక యితర పాపములకు అది దారితీయును. ధనవంతుడైన ఈ వ్యవసాయకుని యేసు వెర్రివాడన్నారు! అతడు ప్రస్తుత సంగతులను గూర్చియు ఆత్మీయ సంగతులను గూర్చియు అవగాహన లేనివాడు.

అతడొక దేవుడు లేని బుద్ధి హీనుడు. దేవుడు లేడని బుద్ధి హీనులు తమ హృదయములో అనుకొందురని దావీదు చెప్పాడు (కీర్తన 14:1). విజయవంతమైన వ్యవసాయ ములో అతడు దేవుని కనుగొన లేకపోయాడు. "ఆస్థిగలవాడు తన ఆస్తిని దాచిపెట్టు కొని తనకు నాశనము తెప్పించు కొనును" (ప్రసంగి 5:13).

బుద్ధిహీనుడైనఈ ధనవంతుడు, మరొక ధనవంతుడు కూడ లాజరుతో పోల్చిచూస్తే, తమ ధనాన్ని యితరులకు ఉపయోగించ లేదు. ధనభోగమువలన వారి హృదయములో దేవుని గూర్చిన తలంపులు అణచి వేయబడినవి. దేవుడు తమకిచ్చిన తలాంతులను సద్విని యోగము చేయ వలెనని కోరుచున్నట్లు తలాంతులను గూర్చిన ఉపమానము తెలియజేయు చున్నది.

లూకా 12:16-21 యేమీ విసర్జించబడాలో తెలియజేస్తే లూకా 16:19-31 లోభత్వము వలన యేమి సంభవించునో తెలియజేయుచున్నవి.

ఈ ఇద్దరుకూడ తాము ధనవంతులైనందు వలన గాక, తమ జీవితములో దేవునికి చోటీయనందున నరకమునకు పోవలసి వచ్చెను. వారు దేవుని యెడల ధనవంతులు కాలేకపోయారు. కడవరి తీర్పులో మన తరుణములను, తలాంతులను దేవుని కొరకు ఎట్లు వినియోగిం చామో దానిని బట్టి మన బహుమతి నిర్ణయించబడును (మత్త 25:31-46). ఇతడు బీదవాడైన ధనవంతుడు. లవొదికయలోని సంఘము వలె అతడు ధనసమృద్ధి సంపాదించుకొన్నాడు. దేనికి కొదువలేక యున్నాడు, గాని అతడు యాతనపడు ప్రదేశముకు పోయాడు!

– లూయిస్ రష్మోర్

## దేవుడెక్కడినుంచి వచ్చారు?
## (From whence came God?)

దేవుడు సృష్టికర్తయును ఈ విశ్వానికి కారకుడును, దాని ఆరంభకుడును, సృజింపబడిన దానంతటికి కర్తయునై యున్నందున ఈ దేవుడెక్కడి నుండి వచ్చారు? ఆయనను ఎవరు సృజించారు? అని మనం అడుగవచ్చును.

**దేవుడు సృజింపబడిన వారు కాదు:**

దేవునికి ఆరంభములేదు, ఆయన సృజింపబడినవారు కాదు. ఆయనకు ఆదియు అంతము లేదు. ఆయన ఉనికిని గూర్చిన కారకులు ఎవరు లేరు. దీని అర్థం యేమిటి ? ఈ భౌతిక ప్రపంచము, కంటికి కనబడుప్రతి సంగతియు, కనబడని వాటిచే సృజింపబడినందున, అనగా దేవుని మేధస్సునుండి కలిగినందు వలన, దేవుని మనస్సే ఆదియని మనం గ్రహించుకోవాలి. లేని దానికి ఉనికి కలిగించుట యెట్లో ఆయన ఎరిగి యున్నారు. ఇంకొక మాటలో ఒక దానిని ఆది కలిగించుట ఎట్లో ఆయన ఎరిగి యున్నారు. ఆయన అన్ని విషయములను గూర్చి పరిపూర్ణజ్ఞానము కలిగియున్నందున, దేనిని గూర్చి ఎవడు ఆయనకు సలహానీయనక్కరలేదు. ఆయన పరిపూర్ణజ్ఞాని. తలంపులు, భావములు ఆయనతో ఆరంభమౌతాయి. పరిపూర్ణ జ్ఞానియైన ఆ మహామహుడు ఆయనే.

**దేవుడు అసలైన పరిపూర్ణజ్ఞానము కలిగి యున్నారు:**

దీనిని అర్థం చేసికొనుట కష్టము కాదు, యిదివరలో మానవుడెన్నడు తలంచని సంగతులను నేడు మన శాస్త్రజ్ఞులు తలంచుచున్నారు. మానవుడు యిదివరకు ఎరుగని సంగతులను వారు కనిపెట్టుచున్నారు. వారు పరిశోధకులు గనుక కనిపెట్టుదురు. కొన్ని సంగతులను కనుగొని తయారు చేయుదురు. మిత జ్ఞానియైన మానవుడు తయారు చేయ

గలిగితే, పరిపూర్ణజ్ఞానియైన దేవుడు ఆదిలో దానిని సృజించారు. మితజ్ఞాని పరిశోధనవలన దానిని కనుగొనుచున్నాడు.

**దేవుడు సమస్తానికి ఆదిసంభూతుడు :**

జ్ఞానమునకు, భావములకు, తలంపులకు దేవుడు అది మాత్రమేగాక, జీవము నకంతకు ఆయనే కారకుడు. జీవమునకు ఆయనే ఆధారభూతుడు. ఆయన యొక్క ఉనికికి, జీవముకు బాహ్యాధారము యేమీ లేదు. సృజింపబడిన సమస్తజీవానికి ఆయనే ఆది సంభూతుడు. సృజింపబడిన ప్రతిజీవి ఆహారముకు, గాలికి, నీరుకు, సూర్యరశ్మికి మొదలగు వాటన్నిటికి బాహ్యాధారము అవుసరము. దేవుని యొక్క శక్తి, జీవము, మంచితనము, ఉనికి మొదలగునవి ఆయనలో నుండియే ఉద్భవించును, ఆయన స్వయంజీవి స్వయం సంభూతుడు, ఆయన ఎవరివలననో ఉనికి కలిగి యున్నవాడుకాదు. ఆయనే ఉండువాడు. అందువలననే దేవుడు, "నేను ఉన్నవాడను అను వాడనై యున్నానని మోషేతో చెప్పెను. మరియు ఆయన ఉండునను వాడు మీ యొద్దకు నన్ను పంపెనని నీవు ఇశ్రాయేలీయులతో చెప్పవలెననెను" (నిర్గమ 3:14). ఉండుననువాడనుటలో ఆయన ఎల్లప్పుడు ఉన్నవాడని, ఎల్లప్పుడు ఉండువాడని యర్థము. ఆయనే ఉనికియై యున్నాడని, జీవమని ఇంకొకమాటలో ఆయన మోషేకుచెప్పెను. ఆయన ఉనికి కలిగి యున్న ప్రతిదానికి ఆధారమై యున్నాడు.

**సజీవుడైన దేవుడు సమస్తజీవాన్ని, శక్తిని ఉత్పత్తి చేయును:**

స్వయం జీవుడైన దేవుని గూర్చిమనం ఊహించుకొనుట కష్టమైతే మన జీవితంలో అనేక సంగతులు దానివలనే యుండునని గ్రహించు కోవాలి. ఆలోచించేవాడు, ఆలోచించుట వలన, ఆశక్తిని కోల్పోవునని యనుకొనునా? అనుకొనడు. సరిగదా ఆలోచించుట వలన అట్టిశక్తి అభివృద్ధిజెందును. ప్రేమించుట వలన మనం ప్రేమించే శక్తిని కోల్పోవుదుమా? మితజీవులమైన మనము ఆలోచించుట వలన, ప్రేమించుటవలన నూతన తలంపులను అమితమైన ప్రేమను జనింపజేయ గలిగితే, మితములేని దేవుడు సర్వసృష్టికి జీవమును, శక్తిని జనింపచేయలేదా?

స్వయం జీవుడైన దేవుని గూర్చి చెప్పుట అసమంజసమని కొందరు తలంతురు, గాని అదేసమయములో వారు ఈ విశ్వము, పదార్థము స్వీయ ఉనికిని కలిగియుండే జీవమా? లేక పదార్థమా ? పదార్థము ఆలోచించదు, సంకల్పించదు, క్రమముగా చలించదు. గాని పదార్థమంతయు సంఘీభావముతో

కూడిన కలిగియున్నవని తలంతురు. ఈ రెండిటిలోను ఏదిసాధ్యము? స్వీయ ఉనికి రీతిగా సంకల్పించబడియున్నది. సంకల్పము అంతయు జ్ఞానము వలన కలిగిన దైనందున, మేధస్సులో భావము లుద్భవించును గనుక, ఇవన్నియు స్వయంజీవుడైన వాని వలన కలిగెననుట సమంజసము.

**దేవుడు సృష్టిని అధిగమించును :**

దేవుడు ఈవిశ్వానికి దానిలోని సమస్తానికి, సర్వసృష్టికి కర్త గనుక ఆయన సృష్టికిముందు నుండే యున్నవాడై యున్నాడు. అట్లు కాకపోతే ఆయన సృజింపలేకపోయేవాడు. యేసుక్రీస్తు సృష్టిజరిగించినపుడు దేవునితో యున్న వాడు గనుక ఆయనను గూర్చి చెబుతు అపొ.పౌలు "ఆయన అన్నిటికంటే ముందుగా ఉన్నవాడు, ఆయనే సమస్తమునకు ఆధారభూతుడు" అని చెప్పెను (కొలస్స 1:17). "పర్వతములు పుట్టకమునుపు భూమిని, లోకమును నీవుపుట్టింపకమునుపు, యుగ యుగము లు నీవే దేవుడవు" అని దావీదు పలికెను (కీర్తన 90:2).

**దేవుడు నిత్యుడు :**

సృష్టిజరిగించకముందు నుండి దేవుడున్నట్లయితే, అదిజరుగక ఎంత ముందు నుండి ఆయన యున్నాడని మనం అడుగవచ్చును. యుగ యుగములకు నీవే దేవుడవు" అని బైబిలు చెప్పుచున్నది (కీర్తన 90:2). దేవుడు నిత్యనివాసియని యెషయా 57:15 చెప్పు చున్నది. శాశ్వతుడైన దేవుని గూర్చి ద్వితీ 33:27 చెప్పుచున్నది. దేవుడు సకల యుగములలోను రాజైయుండి అక్షయు దును, అదృశ్యుడునై యున్నాడని 1 తిమో 1:17 చెప్పుచున్నది.

ఈవిశ్వమంతయు, నిజానికి సృష్టి అంతయు కాలమును బట్టి క్షీణించును "ఆదియందు నీవు భూమికి పునాది వేసితివి. ఆకాశములు కూడనీ చేతిపనులే అవినశించునుగాని నీవునిలచియుందువు. అవన్నియు వస్త్రము వలె పాతగిలును. ఒకడు అంగవస్త్రమును తీసివేసినట్లు నీవువాటిని తీసివేయుదువు" అని కీర్తన 102:25-26 చెప్పుచున్నది. ఈభూమి లయమై పోవునని 2 పేతురు 3:11 చెప్పుచున్నది. "నరుని ఆయువు గడ్డివలె నున్నది. అడవి పువ్వుపూయునట్లు వాడుపూయును. దానిమీద గాలి వీచగా అది లేకపోవును" అని దావీదు పలికాడు (కీర్తన 103:15-16). మన జీవము ఆవిరివంటిదని యాకోబు 4:14 చెప్పు చున్నది. సృష్టిఅంతయు గతాన్ని బట్టి ప్రస్తుతాన్ని కలిగి, భవిష్యత్తులో దానిని కోల్పోవును. భౌతిక సంబంధమైనవన్నియు కాలాన్ని బట్టి పాతగిలును.

దేవుని విషయంలోనైతే యిది

ఖిన్నము. దేవుడు ఒకానొక సమయమందు ఉద్భవించిన వాడు కాదు. ఆయనకు గతంలేదు. భవిష్యత్తులో కాలమును బట్టి పాతగిలడు. ఆయన నిత్యము ఒకేలాగున ఉండును. కీర్తనకారుడు ఇట్లు చెప్పాడు: "నీసంవత్సరములు తరతరములుండును. ఆదియందు నీవు భూమికి పునాది వేసితివి. ఆకాశములు కూడ నీ చేతి పనులే అవి నశించును గాని నీవు నిలిచి యుందువు" (కీర్తన 102:24-25). యెహోవానైన నేను మార్పులేనివాడను" అని మలాకీ 3:6లో దేవుడు పలికారు.

**మార్పులేని దేవుని తత్వనిర్వచనము:**

దేవుని తత్వములోను, శక్తిలోను ఆయన మార్పులేనివాడని ప్రస్ఫుటమగును. ప్రకృతి సూత్రములన్నియు మార్పులేనివి, గ్రహించుకొనదగినవి మరియు మనం ఆధారపడదగినవి. వీటన్నిటిలో దేవుని మార్పులేని తత్వము మనకు విపులమగుచున్నది. అందువలన ఆయన చట్టములు, సూత్రములు మార్పులేనివి. వాటిని మనం మార్పు చేయ జాలనంత ఖచ్చితమైనవి. అందు వలననే, "భూమినిలిచి యున్నంత వరకు వెదకాలమును కోతకాలమును, శీతోష్ణములును వేసవి కాలములును రాత్రింబగళ్లును ఉండక మానవని" దేవుడు నిర్ణయించెను (ఆది.కా. 9:22).

మార్పులేని ఆయన తత్వమును బట్టి దేవుడు ఎల్లప్పుడు పరిశుద్ధుడు, నీతిమంతుడు, యథార్థవంతుడు, క్షమించువాడు, ప్రేమపూర్ణుడు అందు వలన ఆయన ఎంతైనా నమ్మదగిన వాడు. ఆయన తత్వము క్రమేపి అభివృద్ధి జెందినదికాదు, దానిలో మార్పు వుండదు. ఆయన లక్షణములన్నిటిలో దేవుడు పరిపూర్ణుడు. "యెహోవా ఉత్తముడును యథార్థవంతుడునై యున్నాడు". (కీర్తన 25:8). ఆయన నీతిని న్యాయమును ప్రేమించుచున్నాడు" (కీర్తన 33:5).

**కాలముతో దేవుని కున్న సంబంధము :**

దేవుడు నిత్యుడై, కాలమును బట్టి మార్పులేనివాడైతే, కాలముతో దేవునికున్న సంబంధము యేమిటని మనం అడుగవచ్చును. కాలమును, తాత్కాలికమును సృజించినవాడు దేవుడేగనుక కాలమునకు ఆయన లోనుకాడుగాని కాలము ఆయనకు లోబడును, ఇంకోమాటలో సమయం/కాలము దేవుని సేవించును, దేవుడు దానిని మార్పుజేయును. దేవుడుకాలమునకు లోనైన వాడుకాడు, కాలమును బట్టి మార్పుజెందడు, పాతగిలడు గనుక కాలము దేవుని చక్రవర్తికాదు.

అలాగని కాలముకు దేవుడేకి సంబంధము లేదని యర్థము కాదు. ఏలయనగా మానవుని రక్షణార్థము ఆయన

కాల ప్రవేశము చేయును. ఈలోకములో దేవుడు మానవుని ప్రేమించును, గ్రహించుకొనును, సంరక్షించును. మన గతపాపములు, ప్రస్తుత ఆత్మీయాభివృద్ధి, భవిష్యత్ పరిస్థితిని గూర్చి దేవుడు చింతించును. అయితే కాలానుగుణంగా సృష్టిలో సంభవించు మార్పులు, లక్షణములు వగయిరా దేవుని లోమార్పు తేజాలవు. కాలచక్రమును బట్టి దేవుడు తొందరపడడు, మార్పుజెందడు, నిర్మూలించ బడడు. దేవుడు నిత్యుడు గనుక ఆయన ఎన్నడు ఆరంభించలేదు, ఎన్నడు అంత మొందడు. ఆయన ఉనికి కాలమును బట్టి పరిమితిలేనిది. ఈ విషయంలో దేవుడు కాలము లేని జీవియైయున్నారు.

మనం నిత్యము చలించు ప్రస్తుతములో జీవించుచు, మన వెనుక గతాన్ని, ముందు భవిష్యత్తును కలిగి యున్నాము. దేవుని ఉనికి విషయంలో గతం యేమీలేదు. భవిష్యత్తు అంటూ యేమీవుండదు. నేను ఉండుననువాడ నని ఆయన మోషేతో చెప్పినప్పుడు ఆయన ఎల్లప్పుడు జీవించుచుయుండు వాడనని, నిత్యము వుండువాడనని ప్రకటించారు (నిర్గమ 3:14). మన జ్ఞాపకంలో నిన్న మనకొకరోజు, రేపు అనునది ఒక నిరీక్షణ. దేవునికైతే గతము, ప్రస్తుతము అంతా ఒకటే ఏలయనగా ఆయన నిన్న నేడు నిరంతరము ఒకే రీతిగ యుండువాడు. ఆయన కాలగర్భుడు. అందు వలన కాలమును ఆయున తుడిచివేయుట కాదు గాని ఆయన దానికి మించినవాడై యున్నారు. నిత్యత్వము వలన కాలము విషయంలో ఆయన పరిమితి లేనివారు.

– ఓటిన్ గేట్వుడ్

## ద్రాక్షావల్లి మరియు తీగెలు
## (The Vine and the Branches)

యేసు ఇట్లు చెప్పెను : "నేను నిజ మైన ద్రాక్షావల్లిని, నాతండ్రి వ్యవసాయ కుడు. నాలోఫలింపని ప్రతి తీగెను ఆయన తీసిపారవేయును. ఫలించు ప్రతితీగె మరి ఎక్కువగా ఫలింపవలెనని దానిలోని పనికి రాని తీగెలను తీసివేయును నేను మీతో చెప్పిన మాటను బట్టి మీరెప్పుడు పవిత్రులై యున్నారు. నాయందు నిలిచి యుండుడి, మీ యందు నేనును నిలిచియుందును. తీగె ద్రాక్షావల్లిలో నిలిచియుంటేనే గాని తనంతట తానే ఫలింపదు. ద్రాక్షావల్లిని నేను, తీగెలు మీరు, ఎవడు నాయందు నిలిచి యుండునో, నేను ఎవనియందు నిలిచి యుందునో వాడు బహుగా ఫలించును, నాకు వేరుగా ఉండి మీరే మియు చేయలేరు. ఎవడైననునా యందు నిలిచియుండని యెడల వాడు తీగవలె బయట పారవేయబడి యెండి పోవును;

మనుష్యులు అట్టి వాటిని పోగుచేసి అగ్నిలో పారవేతురు, అవికాలి పోవును. నాయందు మీరును, మీయందు నా మాటలును నిలిచియుండిన యెడల మీకేది యిష్టమో అడుగుడి. అది మీకను గ్రహింపబడును. మీరు బహుగాఫలించుట వలన నాతండ్రి మహిమ పరచబడును; ఇందువలన మీరు నాశిష్యులగుదురు" (యోహాను 14:1-8).

పైలేఖనభాగములో యేసు ప్రభువు వాడిన ఉదాహరణ పాత నిబంధనలో మనకు కనబడు అనేక ఉదాహరణలుగా యున్నది. దేవుని ప్రజలు ఐగుప్తులోనుండి తీసికొని వచ్చి కానాను దేశములో నాటబడిన ద్రాక్షవల్లిగా పోల్చబడిరి (కీర్తన 80:8-11). "ఇశ్రాయేలు వంశము సైన్యముల కధిపతియగు యెహోవా ద్రాక్షతోట, యూదా మనుష్యులు ఆయన కిష్టమైనవనము" అని యెషయా 5:7లో చెప్పబడినది. ఇదే రకమైన వర్ణన యిర్మియా లోను, యెహెజ్కేలులోను కూడ మనకు కనబడును. ఆ ద్రాక్షవనములో ఫలముల కొరకు దేవుడు వెదికెను. గాని ప్రజల నిష్ఫలులైరి, అవిధేయులైరి.

"శ్రేష్టమైన ద్రాక్షావల్లివంటి దానిగా నేనునిన్ను నాటితిని, నాకు జాతి హీనపు ద్రాక్షావల్లివలె నీవెట్లు భ్రష్టసంతానమైతివి?" యని ఇశ్రాయేలునుద్దేశించి దేవుడు పలికెను (యిర్మియా 2:21). ఫలములు ఫలించుటే ద్రాక్షావల్లి యొక్క పని, అదిఫలించని యెడల నరికి వేయబడి అగ్నిలో పారవేయబడును. యెహెజ్కేలు 15:1-8లో కనబడు తలంపు యిదే.

పాతనిబంధనలో దేవుని ప్రజలే ద్రాక్షావల్లి. క్రీస్తు వాక్యమైన దేవుడై యుండెను. ఆయన దేవునితోయుండెను, దేవుడైయుండెను (యోహాను 1:1). ఆయన దేవుడు గనుక దాక్షావల్లి యజమాని ఆయనే. ఆయన శరీరము దాల్చినతరువాత (యోహాను 1:14), "నేను నిజమైన ద్రాక్షావల్లిని, నా తండ్రి వ్యవసాయకుడు" అని చెప్పెను. నేను ద్రాక్షావల్లిని తీగెలు మీరు అని కూడ ఆయన చెప్పెను. క్రైస్తవులు క్రీస్తునం దున్న వారు గనుక ద్రాక్షావల్లినందున్న వారు (గలతీ 3:26; రోమా 6:3-4).

తీగెలకు జీవము ద్రాక్షావల్లి నుండి కలుగును. ఫలములు ఫలించా లంటే తీగె ద్రాక్షావల్లిలో యుండాలి. దేవుని మహిమార్థమై మనము ఫలములు ఫలించాలంటే మనము క్రీస్తునందుండాలి. ఆయనలో నిలిచి యుండాలి. అందుకే "ఎవడు నాయందు నిలిచి యుండునో నేనెవనియందు నిలిచి యుండునో వాడు బహుగా ఫలించును, నాకు వేరుగా యుండి మీరేమియు చేయలేరు. ఎవడైనను నాయందు నిలిచియుండని యెడల వాడు తీగవలె బయట పారవేయబడి యెండిపోవును; మనుష్యులు అట్టివాటిని

పోగుచేసి అగ్నిలో పారవేతురు, అవి కాలిపోవును" అని యేసు చెప్పెను (యోహాను 15:5-6).

ద్రాక్షావల్లిలో తీగెలు ఫలించాలి. అది సహజసిద్ధము. క్రీస్తునందున్నవారు క్రొత్త జన్మనొందిన వారు. వారిది మార్చ బడిన తత్వము. గత జీవితము నుండి వారు మార్పునొందిన వారు. "కాగా ఎవడైనను క్రీస్తునందున్న యెడల వాడు నూతన సృష్టి: పాతవి గతించెను, ఇదిగో క్రొత్తవాయెను" (2 కొరింధీ 5:17). క్రైస్తవులు దేవస్వభావములో పాలివారు కావలెను (2పేతురు 1:4).

ఆయన ఆజ్ఞాపించిన వాటన్నిటికి విధేయత చూపు ఫలములను దేవుడు మననుండి కోరుచున్నారు. యిది అనేక లేఖనాలలో చూపబడినది. "అయితే ఆత్మఫలమేమనగా ప్రేమ, సంతోషము సమాధానము, దీర్ఘశాంతము, దయాళు త్వము, మంచి తనము, విశ్వాసము సాత్వికము, ఆశానిగ్రహము" (గలతీ 5:22-23). పౌలు కొలస్సయులకు ఇట్లు వ్రాసాడు. "మేమును మీ నిమిత్తము ప్రార్ధన చేయుట మానక ...మీరు ప్రతి సత్కార్యములో సఫలులగుచు, దేవుని విషయమైన జ్ఞానమునందు అభివృద్ధి పొందుచు అన్ని విషయములలోను ప్రభువును సంతోషపెట్టునట్లు ఆయనకు తగినట్లుగా నడుచుకొనవలెనని ..... దేవుని బతిమాలుచున్నాము" (కొలస్స 1:9-10).

సువార్త ప్రకటన ద్వారా ఆత్మలను సంపాధించుట చాల ప్రాముఖ్యమైన ఫలమైయున్నది. రోమాలోని క్రైస్తవులకు పౌలు ఇట్లు వ్రాసాడు: "సహోదరులారా, నేను ఇతరులైన అన్యజనులలో ఫలము పొందినట్లు మీలో కూడ ఫలమేదైనను పొందవలెనని అనేక పర్యాయములు మీ యొద్దకు రానుద్దేశించితిని" (రోమా 1:13). పౌలు మంచి ఫలములు ఫలించిన ద్రాక్షతీగె, అతడు సువార్త ప్రకటించుచు మంచి ఫలములు సాధించెను. అట్లే ప్రతిక్రైస్తవుడు దేవుని వాక్య జ్ఞానమునందు వృద్ధి పొందుచు యితరులను క్రీస్తుకొరకు సంపాదిస్తు ఫలించవలెను.

- ఒ.పి. బైర్డ్

## పిలుపును వినుట
## (Hearing the Call)

నేడు దేవుడు ప్రజలను రకరకా లుగా పిలుచుచున్నారా? అట్లయితే 2 పేతురు 1:10 లో పేతురు చెప్పినట్లు "మన పిలుపును ఏర్పాటును మరింత నిశ్చయముగా ఎట్లు చేసికొనగలము?

దేవుడు ప్రజలను ఎట్లు పిలుచు

చున్నారో తెలిసికొనుటకు మానవుల యొద్దకు వెళ్లుదుమా? లేక పిలుచుచున్న వాని నుండియే మనకు నిశ్చయమైన జాబు దొరుకునుగదా? ఆయన ఎట్లు పిలుచుచున్నారో దేవుని వాక్యము మనకేమి చెప్పుచున్నది ?

**క్రీస్తు సువార్త వలన పిలువ బడుదుము:**

థెస్సలోనికయలోని క్రైస్తవులు దేవుని వలన ఎట్లు పిలువబడ్డారో పౌలు వారికి జ్ఞాపకము చేసెను: "ప్రభువు వలన ప్రేమింపబడిన సహోదరులారా, ఆత్మ మిమ్మును పరిశుద్ధ పరచుట వలనను, మీరు సత్యమును నమ్ముట వలనను రక్షణ పొందుటకు దేవుడు ఆదినుండి మిమ్మును ఏర్పరచుకొనెను గనుక మేము మిమ్మును బట్టి యెల్లప్పుడును దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లింపబద్ధులమై యున్నాము. మీరీలాగున రక్షింపబడి మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క మహిమను పొందవలెనని ఆయున మా సువార్తవలన మిమ్మును పిలిచెను" (2 థెస్స 2:12-14).

దేవుని పిలుపును గూర్చి 2 తిమో 1:9-10లో చక్కగా ఇట్లు చెప్పబడినది: "మనక్రియలను బట్టికాక తన స్వకీయ సంకల్పమును బట్టియు, అనాది కాలము లోనే క్రీస్తుయేసునందు మనకు అనుగ్రహింపబడినదియు క్రీస్తుయేసును మన రక్షకుని ప్రత్యక్షత వలన బయలు పరచబడినదియునైన తన కృపనుబట్టియు మనలను రక్షించి పరిశుద్ధమైన పిలుపుతో ఆయన మనలను పిలిచెను. ఆ క్రీస్తు యేసు మరణమును నిరర్ధకము చేసి జీవమును అక్షయతను సువార్తవలన వెలుగులోనికి తెచ్చెను".

గనుక పరిశుద్ధపరచబడుట వలన రక్షణ పొందుటకు దేవుడు ఎవరినైనా పిలిస్తే, ఆయన సువార్త ద్వారా అతనిని పిలుచును. ఆయన కృపను బట్టియు, సంకల్పమును బట్టియు యున్న ఆపిలుపు సువార్త ద్వారా కలుగును. గనుక సువార్త అనగా యేమిటో మనం తెలిసికోవాలి.

**క్రీస్తు సువార్త బోధింపబడెను.**

అపొ.పౌలు 1కొరింథీ15:1-4 లో ఇట్లు చెప్పుచున్నాడు: "మరియు సహోదరులారా నేను మీకు ప్రకటించిన సువార్తను మీకు తెలియపరచుచున్నాను. మీరు దానిని అంగీకరించితిరి, దానియందే నిలిచి యున్నారు. మీ విశ్వాసము వ్యర్థమైతేనే గాని నేను ఏ ఉపదేశరూపముగా సువార్త మీకు ప్రకటించితినో ఆ ఉపదేశమును మీరు గట్టిగా పట్టుకొనియున్న యెడల ఆసువార్త వలననే మీరు రక్షణ పొందువారై యుందురు.

సువార్త అనగా క్రీస్తుయేసు యొక్క మరణము, సమాధి, పునరుత్థానము అనువాస్తవములు. అపొస్తలులుకార్యముల గ్రంథమును చదువుట ద్వారా ఈ వాస్తవములను

గమనించవచ్చును. పెంతెకొస్తునాడు పేతురు చేసిన మొట్ట మొదటి ప్రసంగములో ఈ వాస్తవములు కానదగును అతడిట్లనెను:

"ఇశ్రాయేలు వారలారా, యీ మాటలు వినుడి. దేవుడు నజరేయుడగు యేసు చేత అద్భుతములను మహత్కార్యములను సూచక క్రియలను మీ మధ్యను చేయించి ఆయనను తన వలన మెప్పు పొందిన వానిగా మీకు కనబరచెను; ఇదిమీరే ఎరుగుదురు. దేవుడు నిశ్చయించిన సంకల్పమును ఆయన భవిష్యత్ జ్ఞానమును అనుసరించి అప్పగింపబడిన యీయనను మీరు దుష్టుల చేత సిలువవేయించి చంపితిరి. మరణము ఆయనను బంధించి యుంచుట అసాధ్యము గనుక దేవుడు మరణ వేదనలు తొలగించి ఆయనను లేపెను" (అపొ.కా. 2:22-24).

అపొస్తలులు ఈ సువార్తను ప్రకటించినట్లు పదేపదే మనము చూడగలము (అపొ.కా. 3:13-15; 4:10, 5:30, 10:37-43). ఈసువార్త ఎంత ప్రత్యేకమైనదంటే అపొ.పౌలు దాని యొక్క ప్రత్యేకతను గూర్చి యిట్లు హెచ్చరించాడు: "మేము మీకు ప్రకటించిన సువార్తగాక మరియొక సువార్తను మేమైనను పరలోకమునుండి వచ్చిన యొక దూతయైనను మీకు ప్రకటించిన యెడల అతడు శాపగ్రస్తుడవును గాక" (గలతీ 1:8).

గనుక దేవుడు మనష్యులను ఎట్లు పిలుచుచున్నారో మనము ఎరుగుదుము ఎరుగుదుము అట్లుగాక వేరే విధముగా పిలువ బడితిమని చెప్పుకొను వారి సంగతి యేమి చేయుదుము? దేవుడు వారిని ప్రత్యేకముగా పిలుస్తాడని కనిపెట్టు కొనియుండు వారి నేమిచేతుము? ఈ వేరొక సువార్త ద్వారా తాము పిలువబడ్డామని అనుకొను వారిసంగతి యేమిటి?

**మనుష్యజ్ఞానము గాక దేవుని శక్తి :**

"మీ విశ్వాసము మనుష్య జ్ఞానమును ఆధారముచేసికొనక దేవుని శక్తిని ఆధారము చేసికొని యుండవలెను" (1కొరింథీ 2:5). కొరింథీయలు ఏ సువార్తకులో బడితిరో అది మనుష్యుల వలన గాక దేవుని వలన కలిగినదని చెప్పుటకు 1 కొరింథీయులు పత్రికలో మొదటి రెండు అధ్యాయములు తెలియజేయుచున్నవి. అది యూదులు, గ్రీసు దేశస్థులు వెదుకుచున్నది కాదు (1:22) సిలువ వేయబడిన క్రీస్తు యూదులకు ఆటంకముగాను, గ్రీసు దేశస్థులకు వెర్రితనముగాను యున్నాడు (1:23), గాని క్రీస్తు మరణసమాధి పునరుత్థానముల ప్రకటనను దేవుని శక్తిగాను, జ్ఞానముగాను దేవుడు ఎంచుకొని యున్నారు. "ఏ శరీరియు దేవుని యెదుట అతిశయింపకుండునట్లు జ్ఞానులను సిగ్గుపరచుటకు లోకములో నుండి

వెర్రివారిని దేవుడు ఏర్పరచుకొని యున్నాడు. బలవంతులైనవారిని సిగ్గుపరచుటకు లోకములో బలహీనులైన వారిని దేవుడు ఏర్పరచుకొని యున్నాడు ... అయితే ఆయన మూలముగా మీరు క్రీస్తుయేసునందున్నారు. అతిశయించు వాడు ప్రభువునందే అతిశయించవలెను అని వ్రాయబడినది నెరవేరునట్లు దేవుని మూలముగా ఆయన మనకు జ్ఞానమును నీతియు పరిశుద్ధతయు విమోచనము నాయెను" (1 కొరింథీ 1:21-31).

గనుక పౌలువలె "యేసు క్రీస్తును అనగా సిలువ వేయబడిన యేసు క్రీస్తును తప్ప మరిదేనిని మీమధ్యనెరగకుందునని" నిశ్చయించు కొనవలెను (1 కొరింథీ 2:2), "ఇందును గూర్చి దేవుడు తన్ను ప్రేమించు వారికొరకు ఏవి సిద్ధపరచెనో అవి కంటికి కనబడలేదు, చెవికి వినబడలేదు మనుష్య హృదయమునకు గోచరము కాలేదు" (1 కొరింథీ 2:9). "దేవుని వలన మనకు దయ చేయ బడిన వాటిని తెలిసికొనుటకై మనము లౌకికాత్మను గాక దేవుని యొద్ద నుండి వచ్చు ఆత్మను పొంది యున్నామని అందుకే పౌలు చెప్పగలిగాడు (1 కొరింథీ 2:12). ఇంతవరకు దేవుడు మనుష్యులను ఎట్లు పిలుచుచున్నారో చూచియున్నాము. ఆయన తన సువార్త ద్వారా వారిని పిలుచుచున్నారు. అది యేసు యొక్క మరణ సమాధి పునరుత్థానముల వాస్తవములు. అది ఏమానవుని వలన గాని, దేవ దూతవలన గాని మార్పుచేయబడదు. అది మానవులకు ఒక్క సారే అప్పగింపబడెను. ఆసువార్త పిలుపును మనము అంగీకరించవలెను.

సువార్తకు లోబడాలి :

యేసుక్రీస్తు యొక్క మరణ సమాధి పునరుత్థానముల వాస్తవములకు ఒకడు ఎట్లులోబడును? మనము కూడ సిలువపై మరణించి సమాధి చేయబడవలెనా? దేవునికి స్తోత్రము కలుగును గాక, మనం అట్లుచేయనక్కరలేదు. రోమాలో యున్నవారు సువార్తకు ఎట్లు లోబడిరో పౌలు ఇట్లు చెప్పియున్నాడు: "క్రీస్తుయేసులోనికి బాప్తిస్మము పొందిన మనమందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా? కాబట్టి తండ్రి మహిమవలన క్రీస్తుమృతులలో నుండి యేలాగు లేపబడెనో ఆలాగే మనమును నూతన జీవము పొందినవారమైనడుచుకొనునట్లు మనము బాప్తిస్మము వలన మరణములో పాలుపొందుటకై ఆయనతో కూడ పాతిపెట్టబడితిమి. మరియు ఆయన మరణము యొక్క సాదృశ్యమందు ఆయనతో ఐక్యముగలవారమై యున్న యెడల ఆయన పునరుత్థానము యొుక్క సాదృశ్యమందును ఐక్యముగలవారమై యుందుము" (రోమా 6:3-5). దీనిని తాము వినిన ఉపదేశమునకు విధేయత చూపినట్లు పౌలు చెప్పాడు (రోమా 16:17).

## లోతు యొక్క పతనము
### Lot's Fall

లోతు యొక్క పతనమును బైబిలు స్పష్టముగ సూచించుచున్నది. లోతు తన కన్నులెత్తి యొర్దాను ప్రాంతమంతటిని చూచెను(అది కా. 13:10). అతని కొరకు యొర్దాను ప్రాంతమంతటిని యేర్పరచుకొనెను(11వ). ఆత్మీయ సహవాసములో అబ్రహాము నుండి అతడు వేరైపోయెను(11వ). ఆ మైదానమందున్న పట్టణముల ప్రదేశములలో అతడు కాపురముండెను(12వ). సొదొమ దగ్గర తన గుడారము వేసికొనెను(12వ). సొదొమలో అతడు నివసించెను(ఆదికా. 14:12). సొదొమ గవిని యొద్ద అతడు కూర్చుండియుండెను(19:1). ఇది లోతు యొక్క ప్రాముఖ్యతను తెలుపుచున్నది. లోతు సొదొమ పెద్దలలో ఒకనిగా ఎంచబడెను. అతని కుమార్తెలు ఆ దేశస్థులైన సొదొమీయులను వివాహమాడిరి. ప్రారంభములో అతడు పెద్ద మనుష్యునివలె ఎంచబడి చివరకు ఆ దుర్మార్గమైన పట్టణమునకు అధిపతి అయెను. లోతు నీతిగల వ్యక్తి అని బైబిలు చెప్పుచున్నది. “దుర్మార్గుల కామవికార యుక్తమైన నడవడిచేత బహు బాధపడిన నీతిమంతుడగు లోతును దేవుడు తప్పించెను. ఆనీతిమంతుడు వారి మధ్యను కాపురముండి. తానుచూచిన వాటిని బట్టియు వినిన వాటిని బట్టియు, వారి అక్రమమైన క్రియల విషయములో దినదినము నీతిగల తనమనస్సును నొప్పించుకొనుచు వచ్చెను”(2పేతురు2:7-8). కాని అతడు యిహలోక సంబంధమైన దురాశలకు లోనయ్యెను. పాపము యేవిధముగా ఒక్కొక్క మెట్టు క్రిందకి దిగజారిపోవునట్లు చేయగలదో కీర్తనల గ్రంధకర్త చక్కగ తెలియజేయుచున్నాడు. “దుష్టుల ఆలోచన చొప్పున నడువక పాపుల మార్గమున నిలువక, అపహాసకులు కూర్చుండు చోటును కూర్చుండక”(కీర్తనలు 1:1). ఇచ్చట నడువక, కూర్చుండక, నిలువక అను ఈ మూడు అంశములను గమనించుదము. మొదటిగా అది దుష్టుల ఆలోచన, తరువాత అది పాపుల మార్గము, ఆఖరిగ అది అపహాసకులు కూర్చుండు స్థలము. ఇది పతనమునకు లేదా నాశనమునకు మార్గము. కీర్తన గ్రంధకర్త ఈ మార్గము గుండా వెళ్ళని వారు ధన్యులనిచెప్పుచున్నాడు. నాశనమునకు పోవు మార్గమునుండి తప్పించబడిన క్రైస్తవుడు యెహోవా కట్టడల యందు ఆనందించును. ఆ కట్టడలను గూర్చి దివారాత్రము ధ్యానించుచుండును. అతడు నీటి కాలువల యోరను నాటబడిన చెట్టువలె యుండి ఆకు వాడక తన కాల మందు ఫలమిచ్చు చుండును. అతడు చేయునదంతయు సఫలమగును.(2-3వ). కీర్తనలు 1:1 లోతు యొక్క పతనమునకు గల మార్గమును సూచించుచున్నది. 2,3 వాక్యములు క్రైస్తవులమైన మనము ఏర్పరుచుకొనవలసిన మార్గమును తెలియబరచుచున్నది. నీవు ఏ మార్గమున ఎంచుకొనుచున్నావు?

– టామ్ కెల్విన్

## మీకొక గొప్పసదవకాశం

**సత్యవాణి** ద్వారా ప్రచురింపబడిన అత్యంత విలువైన పుస్తకములు 20 రకములు ఇప్పుడు లభ్యమగుచున్నవి. వాటి నికర మూల్యము 500/- రూ॥లు అగును. గాని మీరు 120/- రూ॥లు మాత్రమే మాకు M.O పంపి వాటిని ఉచితముగా పొందవచ్చును. బైబిల్ విద్యార్థులకు, బోధకులకు తర్ఫీతుశాలలకు యిది గొప్ప సదవకాశం. ఈ రోజే మాకు వ్రాయండి. M.O పంపించి పుస్తకములను పొందండి. మీ యింటిలో మినీ లైబ్రరీనీ స్థాపించండి.


# SATYA VANI

# 7-9-35, Sambamurthy Street,

Kakinada - 533 004. Ph: 0884- 2363722



**RNI Regd. No. 69973/98**

**Postal Regd. No. AP-VM/KD/02/2012-2014**


To


From:

SATYA VAKKU

P.O. Box 80, Kakinada - 533 001



Edited & Published by Joshua Gootam. Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004